

# ప్రమాదం జాగ్రత్త!

## - కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

**తను అక్కడికి** వచ్చినట్లు కాత్యాకి, యుగంధర్‌కీ మాత్రం తెలుసు. కాత్యా ఆపదలో చిక్కుకున్నదా అని ఆలోచిస్తూ రాజు రిసీవర్ తీశాడు. "హల్లో" అన్నాడు కాస్త కంఠస్వరం మార్చి, ఎందుకయినా మంచిదని.

"హలో మిస్టర్ రాజా" వులిక్కిపడ్డాడు రాజు. ఎవరది? ఎవరికీ తెలియదే తను అక్కడ వున్నట్టు.

"ఆశ్చర్యపోతున్నావా! అవును మర్చిపోయావు. చాలా ఏళ్ళక్రితం ఒకసారి అత్యవసర పరిస్థితుల్లో నువ్వూ, నేనూ అక్కడ దాక్కున్నము. నువ్వూ, కాత్యా తప్పించుకుని పారిపోయారని తెలియగానే ఫోన్ చేస్తున్నాను" అన్నాడు బండార్కర్.

"ఎక్కణ్ణించి?"

"ఢిల్లీనించి, కాత్యా అక్కడే వుందా?"

"లేదు."

"ఎక్కడికి వెళ్ళింది?"

"నాకు తెలియదు"

"తెలిసినా చెప్పవు. కాత్యా విషయం ముఖ్యంకాదు. యుగంధర్ విషయం. యుగంధర్ని "షూట్ ఆన్ సైట్" అనే ఆజ్ఞ ఇచ్చారు. ఇప్పుడు యీ కేసు అసలు మొదటినించీ నా చేతుల్లో లేదు. సి.బి.ఐ మిలటరీ యింటలిజెన్స్ వాళ్ళది కేసు. మా డిపార్టుమెంట్, రాష్ట్ర పోలీసు శాఖ సహకారం కోరారు అంతే."

"తెలుసు" - అన్నాడు రాజు.

"రాజా! యుగంధర్ గారు నీతో మాట్లాడుతారు. కనుక యీ విషయం ఆయనకి వివరంగా చెప్పు. అధికారులంతా తనకి ఎదురుతిరిగినపుడు ఆ శిఖామణి కేసులో జోక్యం కల్పించుకోవడం క్షేమంకాదు. నేను వేడుకుంటున్నానని చెప్పు -"

"చెపుతాను" అన్నాడు రాజు.

"థాంక్స్! ఈ నెంబరు ఎవరికీ చెప్పను. భయపడక" అని బండార్కర్ డిస్కనెట్ చేశాడు. రాజు ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది రాధ.

"బండార్కర్‌కి యీ టెలిఫోన్ నెంబర్ తెలుసు. యెవరికీ చెప్పనన్నాడు, కానీ, యీ టెలిఫోన్ టాప్ చేస్తే, యుగంధర్ మాట్లాడినపుడు"

"యుగంధర్‌గారి ఉనికి తెలిసిపోతుంది" అన్నది రాధ.

"కాత్యాకి టెలిఫోన్ చేసి చెప్పాలి. ఈ నెంబర్‌కి ఫోన్ చెయ్యవద్దని" అన్నాడు రాజు.

"అలా కాత్యాకి ఫోన్ చేస్తే, ఆమె ఎక్కడ వున్నదో పోలీసులకి తెలిసిపోతుందేమో" అన్నది రాధ.

"అయితే ఒకటే మార్గం. రేపు ఏర్‌పోర్టుకి వెళ్ళి కలుసుకోవాలి, కాత్యాకి చెప్పాలి"

"ఎవరు? మీరు వెళతారా పట్టుకుంటారు. మీరు వేషం ఎంత మార్చుకున్నా తెలుసుకోగలరు. నేను వెళతాను" అన్నది రాధ.

జీన్ వేసుకుని, కళ్ళకి అద్దాలు, భుజానికి హాండ్ బాగ్, జుట్టు జడ వేసుకోకుండా భుజాల మీదికి వదిలేసి, మనిషిని ఎవరూ గుర్తుపట్టలేకుండా తయారయింది.

"ఎలా వున్నాను?" అడిగింది.

"బాగా మారిపోయావు. నడక, నిలుచునే తీరు కూడా మార్చుకో! ఏర్‌పోర్టునించి యిక్కడికి రాక, యిక్కడ వుండి ప్రయోజనం లేదు. ఇంకో చోటున్నది. హ. టీ. 3 అని చెప్పు చాలు" అన్నాడు రాజు.

"మీరా చోటికి వెళ్ళిపోతారా! నేను యెలా రావడం?" అడిగింది. రాజు అలమారలోంచి డబ్బు తీసి యిచ్చి "నువ్వు మళ్ళీ వెనక్కి రావడం మంచిది కాదు. ఈ మారువేషంలోనే బొంబాయి చేరుకో, బొంబాయి ఫ్లయిట్‌లో చోటు లేకపోతే, హైద్రాబాద్, బెంగుళూరో వెళ్ళి అక్కణ్ణించి బొంబాయి చేరుకో."

"చేరుకుని?" అడిగింది రాధ.

"ఏ హోటల్లోనో దిగు. శిఖామణి కేసు విచారణకి వచ్చిన రోజు కోర్టుకి వెళ్ళు. అక్కడ యుగంధర్ తప్పకుండా నీకు కనిపిస్తారు" అన్నాడు రాజు.

బొంబాయి ఫ్లయిట్ యింకా గంటన్నర వుండగానే రాధ ఏర్‌పోర్టు చేరుకుంది. ఆ ఫ్లయిట్‌లో యింకా సీట్స్ ఖాళీగా వున్నాయి. టిక్కెట్టు కొనడమా కాత్యా కోసం కాచుకోవడమా? ప్రయాణీకులు వస్తున్నారు. గంట తర్వాత ఎంబార్కింగ్ టిక్కట్లు యిస్తారు. రాధ ప్రయాణీకుల్ని పరీక్షగా చూస్తోంది. ఏది కాత్యా? చాలామంది ఆడవాళ్ళు, పిల్లల్ని ఎత్తుకుని, భర్తలతో, తోటి స్త్రీలతో వస్తున్నారు. కాత్యా కనిపించలేదు. ఏం చెయ్యాలి? ఆలోచిస్తుండగా, పక్కగా పిల్లాణ్ణి ఎత్తుకుని వచ్చి, రహస్యంగా "ఏమిటి రాధా? నాకోసం వెతుకుతున్నావా? అడిగింది కాత్యా. రాధ తన కళ్ళని తనే నమ్మలేకపోయింది. చంకన రెండేళ్ళ పిల్లవాణ్ణి వేసుకున్న కాత్యా అంత లావుగా, వయసు ముదిరినట్టు ఎలా తయారయింది.

"నా రూపం గురించి ఆశ్చర్యపడుతున్నావా! అదంతా తరువాత ఆలోచించవచ్చు. త్వరగా చెప్పు" అన్నది కాత్యా.

రాధ చెప్పింది. "సరే! నువ్వు యీ ఫ్లయిట్‌లోనే బయలుదేరు. బొంబాయిలో దాదర్‌లో వుడిపి లాడ్జింగ్ వుంది. అందులో దిగు. పేరు మార్చుకోనవసరంలేదు. నేను నీకు ఫోన్ చేస్తాను" అని కాత్యా ఆ రెండేళ్ళ పిల్లాడ్ని తీసుకుని, రామానంద్, ఆయన భార్యా, మరో యిద్దరు పిల్లలు వున్న చోటుకి వెళ్ళింది.

రామానంద్ బంధువో, లేక పిల్లల ఆయాగానో కనిపిస్తోంది కానీ, ఆమె యుగంధర్ అసిస్టెంట్ కాత్యా అని, అంత పరిచయం వున్న యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు కూడా తెలుసుకోలేదు.

## 22

తనతోపాటు పనిచేస్తున్న లోడర్స్ యెవరికీ తెలియదు, యుగంధర్ దగ్గర చాలా డబ్బు వున్నదని. ఆ డబ్బు జీరోనించి తీసుకున్న డబ్బు. ఈ పాటికి కాత్యా బొంబాయి చేరుకుని వుండాలి. ఇక రాజు అవసరం కూడా వుంది తనకి. మధ్యాహ్నం యెవరికీ

కనిపించకుండా యుగంధర్ బస్టాండులోంచి వెళ్ళిపోయి, హోటల్ యింపీరియల్‌కి ఫోన్ చేసి, "శ్రీరామానందగారు వున్నారా?" అడిగాడు. "జస్ట్ ఒన్ మినిట్" అని ఆపరేటర్ ఆ గదికి ఫోన్ కనెక్టు చేశాడు.

"హల్లో!" కాత్యా కంఠస్వరం.

"హల్లో! " అన్నాడు యుగంధర్.

"పోల్చుకున్నాను."

"ఎవరున్నారు?"

"ఎవరూలేరు."

"రావచ్చా!"

"ఆఁ!" అన్నది కాత్యా.

రిసీవర్ పెట్టేసి, బయలుదేరాడు. ఒక కొట్టు దగ్గర ఆగి, ఒక పెద్ద ట్రంకు పెట్టె కొన్నాడు యుగంధర్. పెద్ద ట్రంక్ పెట్టెతో లోపలికి వచ్చిన లోడర్ వేషంలో వున్న యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు హోటల్ యింపీరియల్‌లో రిసెప్షనిస్టు"

"సేట్ రామానందంగారికి" అన్నాడు యుగంధర్.

"రూం నెంబర్ 506. ఫ్లోర్ నంబర్ 6" అన్నాడు రిసెప్షనిస్టు.

బజర్ చప్పుడయింది. కాత్యా తలుపు కొద్దిగా తెరిచింది.

"సేట్ రామానందంగారికి" అన్నాడు యుగంధర్. అటే హోటల్ రూం బోయ్ వెళుతున్నాడు.

"లోపలికి తీసుకురా" అని, యుగంధర్ పెట్టెతో సహా లోపలికి రాగానే తలుపు మూసేసింది. ఆయాసంతో తృప్తిగా ఒక నిట్టూర్పు ఒదిలి సోఫాలో కూర్చున్నాడు యుగంధర్. కాత్యా వివరాలన్నీ చెప్పింది.

"రామానంద్ మద్రాసు వెళ్ళిపోయారు. గది ఆయన పేరుతోనే వున్నది. భయంలేదు" అన్నది కాత్యా.

"వెరీగుడ్! రాజు అవసరంగా బొంబాయి రావాలి. ఎలా?" అన్నాడు యుగంధర్.

"హయిడ్ అవుట్ నెం3లో వున్నాడు. ఫోన్ చేసి చెప్పవచ్చు" అన్నది కాత్యా.

"ఆ పని చెయ్యి, రేపు శిఖామణి కేసు విచారణకి వస్తోంది. నువ్వు బజారుకి వెళ్ళి..."

హోటల్ ఉడిపిలో రూం నెంబర్ 427లో వున్నది రాధ. ఏ చిన్నవూరో అయితే ఒంటిగా వచ్చి, హోటల్లో దిగిన స్త్రీని అనుమానంతో చూస్తారు. అది బొంబాయి నగరం. కాఫీ తాగి, దినపత్రిక తీసుకున్నది. రెండవ పేజీలో పెద్ద అక్షరాలతో.

"షీలా ముఖర్జీ హత్యకేసు, విచారణ. ఈ రోజు సిటీ ఛీఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో శిఖామణిని హాజరు పరిచి, విచారణ ప్రారంభం అవుతుంది" అంతే! దినపత్రిక పెట్టేసి, డ్రెస్ చేసుకోవడం ప్రారంభించింది రాధ.

పూర్తిగా వేషం మార్చుకున్న కాత్యా ఒక బ్రీఫ్ కేసుతో సహా టాక్సీ ఎక్కింది. టాక్సీ డ్రయివర్ మారు మాట్లాడకుండా కారు తోలుతున్నాడు.

"ప్రమాదం ఏమీలేదా?" అడిగింది కాత్యా.

"ఏమీలేదు. ఎటొచ్చీ, యీ టాక్సీ డ్రయివర్ చెప్పకుండా వుండాలి."

"చెప్పడు. బాగా డబ్బు యిచ్చాను. కోర్టు కాంపౌండ్‌లో వుంటాడు. మనం టాక్సీ దిగగానే టాక్సీ తీసుకుని వెళ్ళిపోతాడు" అన్నది.

"నువ్వు జంకు లేకుండా ధైర్యంగా నడవాలి. అంతే" అన్నాడు యుగంధర్.

"మీరు మళ్ళీ యెలా వస్తారు?"

"వస్తానుగా, ధైర్యంగా వుండు. నువ్వు వెంటనే హోటలుకి వెళ్ళు." అన్నాడు యుగంధర్ వెనక సీటులోంచి, బరువుగా వున్న బ్రీఫ్‌కేసు తీసుకుంటూ. ముందు కాత్యా, వెనక డ్రయివర్ వేషంలో వున్న యుగంధర్. యెందరో పోలీసు ఉద్యోగులు, సి.ఐ.డిలు, ఆ ప్రాంతల్లో తిరుగుతున్నారు. వకీళ్ళకని ప్రత్యేకంగా వుద్దేశించబడిన గదివరకూ వెళ్ళాక, యుగంధర్ బ్రీఫ్‌కేసుతో ఆ గదిలోకి వెళ్ళాడు. కాత్యా వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. ఒక టాక్సీ డ్రయివర్ బ్రీఫ్‌కేసు తీసుకుని రావడం ఎవరూ పట్టించుకోలేదు, ఏ వకీలు తాలూకో అని అనుకున్నారు. యుగంధర్ తిన్నగా 'బాత్‌రూం' అని వ్రాసి వున్న చోటికి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

రాధ కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి. బోనులో నిలబడ్డ శిఖామణిని చూసి తనే పోల్చుకోలేకపోయింది. మనిషి సగం అయిపోయాడు. కళ్ళల్లో జీవంలేదు. లేచి నిలుచుని, శిఖామణికి కనిపిద్దామని అనిపించింది, కానీ వొద్దని చెప్పారు. అతి కష్టం మీద తమాయించుకున్నది.

"యువర్ ఆనర్! 1978 ఫిబ్రవరి 5వతేదీ రాత్రి వింగ్ కమాండర్ ముఖర్జీ భార్య షీలా ముఖర్జీని, వారి యిద్దరి పిల్లల్ని మోసం చేసి, కారు యెక్కించుకుని తీసుకుపోయిన నేరం పీనల్‌కోడ్ సెక్షన్ నెంబర్ 359, అండ్ 361 ప్రకారం, షీలాముఖర్జీని బలాత్కారంగా మానభంగం చేసినందుకు సెక్షన్ 375 ప్రకారం, షీలా ముఖర్జీని బుద్ధిపూర్వకంగా హత్యచేసినందుకు సెక్షన్ 300 ప్రకారం, ముద్దాయి శిఖామణి మీద ప్రాసిక్యూషన్ తరపున నేరారోపణ చేస్తున్నాను" అన్నాడు ప్రాసిక్యూటర్.

మేజిస్ట్రేటు బోనులో నిలుచున్న శిఖామణిని ఒకసారి చూసి "ముద్దాయి తరఫున వాదించేందుకు అడ్వకేటు -"

"యువరానర్, ముద్దాయి యీ నేరాలు చేసినట్టు వ్రాతమూలకంగా అంగీకరించాడు. అంతేకాక, తన తరఫున వాదించేందుకు అడ్వకేటు అవసరంలేదనీ "గిల్టీ" అని ఒప్పుకుంటాననీ చెప్పాడు."

"అభ్యంతరం యువర్ ఆనర్"

కోర్టులో చాలామంది అడ్వకేట్లు, సీనియర్ పోలీసు అధికార్లు, వింగ్ కమాండర్ ముఖర్జీ వున్నారు. అందరూ ఆ మాటలు అన్న మనిషిని ఆశ్చర్యంతో చూశారు.

"ముద్దాయి శిఖామణి తరపున వాదించేందుకు అడ్వకేటు అవసరం లేదనీ, మైలర్నడ్ ఫ్రెండ్ ప్రాసిక్యూటర్ చెప్పడం న్యాయశాస్త్ర ధర్మానికే విరుద్ధం. ముద్దాయి శిఖామణి భార్య శ్రీమతి రాధ, తన భర్త తరఫున వాదించమని నన్ను కోరారు."

"మీ పేరు?" అడిగాడు మేజిస్ట్రేటు.

"యుగంధర్."

"ఆర్ యు ఏ మెంబర్ ఆఫ్ ది బార్?"

"యస్ యువర్ ఆనర్."

"ముద్దాయి శిఖామణి తన తరఫున మిమ్మల్ని వాదించమని కోరినట్టు"

"యువర్ ఆనర్ ముద్దాయిని కలుసుకోవడానికి ఇంతవరకూ వీలులేకపోయింది. మీ సమక్షంలో వకాలత సంతకం పెడతాడు. అంతేకాక 'నాట్ గిల్టీ' అని.."

"అభ్యంతరం యువర్ ఆనర్, 'నాట్ గిల్టీ' అని ముద్దాయిని చెప్పమని మై లర్నడ్ ఫ్రెండ్ ప్రోత్సహిస్తున్నారు."

కోర్టులో సంచలనం, అందరూ గుసగుసలు. పోలీసు అధికారులు, కోర్టులోంచి బైటికి పరుగెత్తుతున్నారు, రాధ లేచి నిలుచున్నది. శిఖామణి అటు చూశాడు. రాధ తలవూపింది.

''ఆర్డర్! ఆర్డర్'' అని, మేజిస్ట్రేటు ముద్దాయివైపు తిరిగి -

''ముద్దాయి అభిప్రాయం?'' అడిగాడు.

''యువర్ ఆనర్, షీలా ముఖర్జీని నేను హత్య చెయ్యలేదు. హత్య చేశానని పోలీసులు బలవంతంగా నా నించి వాగ్మూలం తీసుకున్నారు. నా తరఫున వాదించేందుకు యుగంధర్‌గార్ని నియమించుకుంటాను కోర్టువారి అనుమతితో''

''ముద్దాయి నేరం చెయ్యలేదని అంటున్నాడు కనుక, చేసినట్లు యిచ్చిన వాగ్మూలం పరిగణించను. డిఫెన్సు తరపున మిస్టర్ యుగంధర్ వాదిస్తారు. మిస్టర్ ప్రాసిక్యూటర్, యు కెన్ ప్రోసీడ్'' అన్నారు మేజిస్ట్రేటు.

నల్లకోటు వేసుకున్న యుగంధర్ వెనక్కి వచ్చి కూర్చున్నాడు. ఎదురుగా కూర్చున్నారు బొంబాయి పోలీసు ఐ.జి, డి.ఐ.జి., ఎ.సి క్రయిమ్స్.

''మిస్టర్ యుగంధర్. ఏమిటి యీ సాహసం?'' అడిగాడు ఐ.జి.

యుగంధర్ నవ్వి వూరుకున్నాడు. ఏ.సి. క్రయిమ్స్‌కి ఏదో చెప్పాడు. డి.ఐ.జి, ఏ.సి కోర్టులోంచి బయటికి వెళ్ళారు. కోర్టులోంచి బయటికి వెళుతుండగా తనని పట్టుకుంటారని యుగంధర్‌కి తెలుసు. నవ్వుకున్నాడు మళ్ళీ.

రాజు టెలిఫోన్ రిసీవర్ పెట్టేసి ఆలోచిస్తున్నాడు. కాత్యా చాలా క్లుప్తంగా చెప్పింది. వెంటనే బొంబాయి రమ్మనీ, యుగంధర్‌ని కలుసుకోమనీ. అంతే! మారువేషంలో వెళ్ళాలా! యుగంధర్ యెక్కడ వున్నాడు? కాత్యా యెక్కడ వున్నది? ఈ వివరాలేమి చెప్పలేదు చెప్పకపోయినా, మారువేషంలోనే బొంబాయి చేరుకోవాలి. లేదా తనని పట్టుకుని, తనని ఎరగా ఉపయోగించవచ్చు యుగంధర్ని పట్టుకునేందుకు. ఏ మారువేషం వేసుకోవాలి? ఎలా వెళ్ళాలి? రైలులోనా! విమానంలోనా 'వెంటనే' అన్నది కాత్యా. అంటే విమానం. అందరి కళ్ళల్లో కారం కొట్టి పారిపోవడం ఒక ఎత్తు, ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని మోసగించటం ఒక ఎత్తు తను ఎంతగా రూపం మార్చుకున్నా, కంఠస్వరం మార్చినా తెలుసుకుంటాడు. ఒకటే మార్గం. మీనంబాకం విమానాశ్రయం దరిదాపులకి వెళ్ళకూడదు. ఒక పాత సూట్‌కేసు తీసుకున్నాడు. అందులో అవసరమైన బట్టలేకాక, వృత్తిగతంగా అనవసరమైన పనిముట్లు, ఆయుధాలు పెట్టుకున్నాడు. గోచిపెట్టి పంచ, ఖద్దరు లాల్చీ, నల్లని వెస్టుకోటు, గాంధీ టోపీ, జుట్టుకి తెల్లరంగు నెరసినట్టు, కళ్ళకి అద్దాలు, ఒకసారి అద్దంలో చూసుకున్నాడు. తనకి పరిచయం వున్న వాళ్ళు యెవరూ తనని గుర్తుపట్టలేరని నిశ్చయించుకుని, అక్కణ్ణించి సెంట్రల్ స్టేషన్‌కి వెళ్ళి, బృందావన్ రైలులో బెంగుళూరుకి టిక్కెట్టు కొన్నాడు రాజు. అయిదున్నర గంటల ప్రయాణం. మధ్యాహ్నం ఒంటిగంటకి బెంగుళూరు చేరుకుంటుంది. బెంగుళూరు నించి విమానంలో మూడు గంటలకి ఫ్లయిట్ వుంది.

కిటికీ దగ్గర సీటులో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాడు.

''మీది ఏ పార్టీ?'' అడిగాడు పక్కనున్న మనిషి.

''అంటే?'' యెదురు ప్రశ్న వేశాడు రాజు.

''పూర్వం గాంధీ టోపీ పెట్టుకున్న వాళ్ళంతా కాంగ్రెస్ వాళ్ళు అనుకునేవాళ్ళం. యిప్పుడు ప్రతి రాజకీయవేత్తా యీ వేషమే వేసుకుంటున్నాడు. అందుకని అడిగాను.''

''నేను రాజకీయవేత్తను కాను. ఇప్పటి రాజకీయాలతో నాకు యెటువంటి సంబంధం లేదు. ఎప్పుడో చిన్నప్పుడు, క్విట్ యిండియా ఉద్యమంలో పాల్గొన్నాను అంతే. గాంధీ శిష్యుడ్ని.''

అందరూ విరగబడి నవ్వారు.

"అవునులెండి, యిప్పుడు ప్రతి రాజకీయవేత్తా గాంధీ శిష్యుడ్ని అనే అంటాడు" అన్నాడు యింకొకడు.

వాదనలోకి దిగడం యిష్టంలేదు రాజుకి. "అవును గాంధీజీ పేరుని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుంటున్నారు" అని మళ్ళీ పత్రిక చదవడం ప్రారంభించాడు.

సిటీ కంటోన్‌మెంట్ స్టేషన్‌లోనే దిగేసి, ఆటో చేరుకున్నాడు ఏర్‌పోర్ట్‌కి. తనని యెవరన్నా వెంటాడుతున్నారా అని కనుకొలకుల్లోనించి గమనిస్తూనే వున్నాడు. తన కంపార్టుమెంటులో, తన ముందు కూర్చుని తనతో మాట్లాడిన యిద్దరు భారీగా వున్నవాళ్ళు, ఒక ఆటో యెక్కడం చూశాడు. ఎందుకయినా మంచిదని తను ఆటో యెక్కి కూర్చుని, సిటీ మార్కెట్‌కి వెళ్ళమన్నాడు. ఆ యిద్దరు యెక్కిన ఆటో తన ఆటో వెనకే వస్తోంది. కొంతదూరం వెళ్ళాక "డ్రయివర్ మర్చేపోయాను, అవసరంగా విమానాశ్రయానికి వెళ్ళాలి తిప్పు" అన్నాడు రాజు. గొణుగుతూ డ్రయివర్ ఆటో తిప్పాడు. కొంతదూరం వెళ్ళాక వెనక్కి చూశాడు రాజు, ఆ ఆటో తనతోపాటు వెనకే వస్తోంది. సందేహం లేదు. వాళ్ళు తనని వెంటాడుతున్నారు. తనని యెలా పోల్చుకున్నారు? వాళ్ళు యెవరు? ఇవి తర్వాత ఆలోచించవలసిన సమస్యలు, ముందు వాళ్ళకి కనిపించకుండా...

"యువర్ ఆనర్! ముద్దాయి శిఖామణి, షీలా ముఖర్జీని హత్యచేసిన నేరారోపణ నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టే సాక్ష్యం ఏమిటో క్లుప్తంగా ముందే వివరిస్తాను. ముద్దాయి శిఖామణి, పేరు మోసిన గజదొంగ అనీ అతని కోసం వివిధ రాష్ట్రాలలో పోలీసులు గాలిస్తుండగా, యెవరికీ చిక్కకుండా ముద్దాయి పోలీసులనించి తప్పించుకుని పారిపోతున్నాడనే విషయం నిరూపిస్తాయి. యువర్ ఆనర్! ముద్దాయి శిఖామణి 1978 అక్టోబర్ నాలుగవతేదీ ఒక అంబాసిడర్ కారు దొంగలించి, ఆ కారు నెంబరు ప్లేటు మార్చాడని, అక్టోబర్ అయిదవతేదీ రాత్రి ఎనిమిది గంటలకి, పారడయిజ్ థియేటర్లో ముద్దాయి షీలా ముఖర్జీని, ఐస్‌క్రీం పార్లర్‌లో కలుసుకుని ఆమె భర్త వింగ్ కమాండర్ ముఖర్జీ ఆక్సిడెంట్‌లో గాయపడి, ఆస్పత్రిలో వున్నారనీ, తీసుకువెళ్ళడానికి వచ్చాననీ అబద్ధాలు చెప్పి, ఆమెనీ, ఆమె పిల్లలు యిద్దర్నీ, ఆ దొంగలించిన అంబాసిడర్ కారులో ఎక్కించుకుని తీసుకుని వెళ్ళాడనీ, ఐస్‌క్రీమ్ పార్లర్ మనిషి ద్వారా, కారు పార్కింగ్ అటెండరు ద్వారా నిరూపిస్తాము. అంతేకాదు. కారు కొంతదూరం వెళ్ళిన తర్వాత షీలా ముఖర్జీకి మత్తుమందు యిచ్చాడనీ, ట్రంక్ రోడ్ మీదకి వెళ్ళిన తర్వాత బొంబాయికి యిరవైమైళ్ళ దూరంలో పిల్లలు యిద్దర్నీ, నిశిరాత్రివేళ ట్రంక్‌రోడ్ మీదకి, సిగిరెట్ విసిరినట్టు విసిరేశాడనీ ఆ పసిపిల్లలచేతే చెప్పిస్తాము. మరొక పదిమైళ్ళు వెళ్ళిన తర్వాత షీలా ముఖర్జీని, కారులోంచి యీడ్చికెళ్ళి, పొదల మధ్య గడ్డిమీద, ఆమెని బలాత్కారం చేసి మానభంగం చేశాడనీ, ఆ తర్వాత ఆమెని గొంతు నులిమి చంపేశాడనీ, నిర్భేద్యమైన సాక్ష్యాలతో నిరూపిస్తాము. ఆ తర్వాత పోలీసులు శిఖామణిని పట్టుకున్నారనీ, శిఖామణి పోలీసులకి వ్రాతపూర్వకంగా తను నేరం చేసినట్టు వాఙ్మూలం యిచ్చినట్టూ నిరూపిస్తాము. పోలీసు అధికారులు యింటరాగేషన్ గదిలోంచి, ముద్దాయి మోసం చేసి, బలప్రయోగంతో తప్పించుకుని పారిపోయాడని నిరూపిస్తాము.

ఆ తర్వాత తనని పోలీసులు యెలాగూ పట్టుకుంటారని తెలిసి, ముద్దాయి బొంబాయి హైకోర్టు జస్టిస్ గోపాలయ్యర్ యింటికి వెళ్ళి, పోలీసులు తనని హింసిస్తున్నారనీ, జుడిషియల్ కస్టడీలోకి తీసుకోమని చెప్పి, సరండర్ అయ్యాడని నిరూపిస్తాము. "

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments